రైతులకు స్వీట్లు తినిపిస్తున్న మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

రైతులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ సన్మానం

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 23 : జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా స్టేషన్ ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రైతులను సన్మానించారు. మార్కెట్ చైర్ పర్సన్ జాలుకుంట్ల లావణ్యాశిరీష్ రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, మార్కెట్ డైరెక్టర్లు రైతులను సత్కరించి స్వీట్లు తినిపించారు. రైతు లేనిదే దేశం లేదని, అన్నదాతలను గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసును అందించిన కండక్టర్

జనగామ, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ బస్సులో వెళ్తూ తన మెడలోని బంగారు గొలుసు పోగొట్టుకున్న ప్రయాణికురాలికి తిరిగి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు ఓ మహిళా కండక్టర్. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం సాయంత్రం జనగామ డిపో బస్సులో హనుమకొండ నుంచి జనగామ ప్రయాణం చేస్తున్న ఓ మహిళ తన మెడలోని 17 గ్రాముల బంగారు గొలుసును పోగొట్టుకోగా, వేరొక ప్రయాణికురాలికి దొరికింది. గమనించిన బస్సు కండక్టర్ పీ సంధ్యారాణి ఆభరణాన్ని స్వాధీనం చేసుకొని డిపోలో అప్పగించారు. సోమవారం జనగామ డిపో మేనేజర్ ఎస్ స్వాతి సమక్షంలో గొలుసు పోగొట్టుకున్న ప్రయాణికురాలికి తిరిగి అప్పగించారు. ఈ కార్యక్రమంలో జనగామ డిపో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) డీ హుస్సేన్, ఏడీసీ టీబీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

నర్మెటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

29న రజక రిజ్వరేషన్ సమితి రాష్ట్ర మహాసభలు

నర్మెట, డిసెంబర్ 23: రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర మూడో మహాసభలు ఈ నెల 29న జనగామలో నిర్వహిస్తున్నట్లు సమితి నాయకులు తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మినలాపురం జలంధర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని రజకుల హక్కుల సాధనకు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎదునూరి నరేశ్, మండల అధ్యక్షుడు ప్రజ్ఞపురం అంజయ్య, సభ్యులు నర్సింహులు, శ్రీనివాస్, శ్రీధర్, సిద్ధులు, రమేశ్, మల్లేశ్, యాదగిరి, మేడిపల్లి సాంబయ్య, కరుణాకర్, ఇస్తారి, మల్లేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఉపాధ్యాయుల సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న ఎంఈవో కళావతి

దేవరుప్పుల, డిసెంబర్ 23: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో మెసెంజర్‌గా పనిచేస్తున్న మరిపల్లి యాకయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబాన్ని ఎంఈవో గుంటుపల్లి కళావతి నేతృత్వంలో ఉపాధ్యాయులు సోమవారం పరామర్శించారు. అనంతరం మృతుడి భార్య వాణికి రూ.1,22, 200 ఆర్థిక సాయం అందించారు. సమగ్రశిక్షా ఉద్యోగుల పక్షాన జిల్లా బాధ్యుడు తాడూరు రమేశ్ రూ.20 వేలు అందించారు. ఎంఈవో కళావతి మాట్లాడుతూ మరిపల్లి యాకయ్య తాత్కాలిక ఉద్యోగిగా 15 ఏళ్లు విద్యాశాఖకు సేవలందించారని, రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సీహెచ్ ఉపేందర్, కోలుకొండ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విష్ణు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు అంబటి అంజయ్య, వాంకుడోత్ బీకోజీ, గోలి తిరుపతిరెడ్డి, జోగు వరప్రసాద్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్, బానోత్ వెంకన్న, బాలనర్సయ్య, కిరణ్, ఖాజా నసీరుద్దీన్, మల్లేశం, వెంకన్న, సత్యనారాయణ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ నాయకులు గోరంట్ల యాదగిరి, బాకీ వెంకటేశ్వర్లు, మార్గం నర్సింహులు, గోలి రవీందర్‌రెడ్డి, బుర్ర యాకస్వామి, రాంచందర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సర్టిఫికేట్స్ పోయినవి
నేను S.రాధాకృష్ణ నా ఆఫీస్ బచ్చన్నపేటకు వెళ్లేటప్పుడు నా ఒరిజినల్ ఎడ్యుకేషనల్ సర్టిఫికేట్ లు,మెమోస్ (SSC, ఇంటర్, BTech, MBA) మరియు ఇండియన్ పాస్‌పోర్ట్ అన్నీ పోయినాయి. ఎవరైనా దాన్ని కనుగొంటే, దయచేసి తెలియచేయగలరు. S.రాధాకృష్ణ,ph: 9989299567

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎలక్ట్రిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.
NT-326623

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

రెండు రోజులు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 23 : ఈ నెల 25, 26 తేదీల్లో స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ చైర్ పర్సన్ లావణ్యాశిరీష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపు క్రిస్మస్, ఎల్లుండి బాక్సింగ్‌డే సందర్భంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలకు సెలవు ఉన్నందున పత్తి కొనుగోలు చేయడం లేదన్నారు. శివునిపల్లిలోని శివసాయి కాటన్ ఇండస్ట్రీస్, చిల్పూరు మండలం రాజవరంలోని సిరి కాటన్ ఇండస్ట్రీస్ పత్తి మిల్లుల వద్దకు రైతులు పత్తిని తీసుకు రావొద్దని ఆమె సూచించారు. తిరిగి శుక్రవారం నుంచి పత్తి కొనుగోలు చేపడుతామని ఆమె పేర్కొన్నారు. దీనిని రైతులు గమనించాలని కోరారు.

మెడిసిన్‌ను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

అక్రమంగా మెడిసిన్‌ను నిల్వ చేసిన వ్యక్తిపై కేసు

రఘునాథపల్లి, డిసెంబర్ 23: నిబంధనలకు విరుద్ధంగా మెడిసిన్‌ను నిల్వ చేసి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తెలిపారు. మండలంలోని కంచనపల్లికి చెందిన వైద్యుడు రంగోజు ఈశ్వరయ్య సుమారు 40 రకాల అలోపతి మందులను నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో సోమవారం ఔషధ నియంత్రణ అధికారులు రా జ్యలక్ష్మి, ఏలే బాలకృష్ణ, అరవింద్ తని ఖీ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన రూ.25 వేల విలువైన మెడిసిన్‌ను సీజ్ చేశారు. ఈశ్వరయ్యపై కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మెడిసిన్‌ను నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాణి పాల్గొన్నారు.

ఎర్త్ ఫౌండేషన్ సేవలతో విద్యార్థులకు మేలు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కంప్యూటర్ శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : ఎర్త్ ఫౌండేషన్ సేవలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు వరంలా ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ స్కిల్స్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఫౌండేషన్ స్కిల్స్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలో వెయ్యి మంది ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్స్, సైన్స్ ఆన్ వీల్స్, మోటివేషన్, స్పోర్ట్స్‌లో శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ ఎర్త్ ఫౌండేషన్ జిల్లాలో విద్యార్థులకు అద్భుత అవకాశం ఇవ్వడం గొప్ప విషయమని అన్నారు. విద్యార్థులు ఎర్త్ ఫౌండేషన్ ద్వారా అందించే అన్నీ అంశాలు శ్రద్ధతో నేర్చుకోవాలన్నారు. ఫౌండేషన్ సేవలను జిల్లాలోని పాఠశాలల్లో విస్తరింపచేయాలని ఆయన కోరారు. ఫౌండేషన్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జిల్లాలో ఎక్కువ మంది విద్యార్థులకు సేవలందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ కృష్ణమూర్తి, ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ బుడ్డ ఆంజనేయులు, తుంగ కౌశిక్, కౌన్సిలర్లు, దయాకర్, సురేశ్‌రెడ్డి, పనుగంటి ప్రవీణ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రాజకుమార్, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పల్లా పరామర్శ

జనగామ పట్టణంలో వివిధ కారణాలతో మరణించిన కుటుంబాలను సోమవారం స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో మరణించిన ప్రముఖ వ్యాపారవేత్త రేణిగుంట నాగభూషణం కుటుంబానికి సానుభూతి తెలిపి కుమారులను ఓదార్చారు. కృష్ణ కళామందిర్ సమీపంలో గుండెపోటుతో మరణించిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు తోకల యాదగిరి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, ఉడుగుల శ్రీలత, తమ్మిశెట్టి మల్లికార్జున్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, నాయకులు బిజ్జాల నవీన్ తదితరులు ఉన్నారు.

పద్మావతిని సన్మానిస్తున్న మంత్రి సీతక్క

మంత్రి సీతక్కను కలిసిన వీవోఏలు

రఘునాథపల్లి, డిసెంబర్ 23: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్కను వీవోఏల జేఏసీ రాష్ట్ర అధ్యక్షురాలు మినుముల పద్మావతి సోమవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ వీవోఏలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నందున పరిష్కరించాలని కోరారు. దీనికి మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి సెర్ప్ సీఈవోతో ఫోన్ మాట్లాడారు. వీవోఏల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సంక్రాంతిలోపు సాగునీరు అందించాలి : కడియం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ చౌరస్తా, డిసెంబర్ 23 : సంక్రాంతి పండుగలోపు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని సాగు నీటి కాలువలకు నీరందించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి ఎమ్మెల్యే కడియం నియోజకవర్గంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్ట్ పరిధిలో భూ సేకరణ, సిల్ట్ తొలగింపు, యాసంగి సీజన్‌కు సంబంధించి పొలాలకు సాగు నీరు అందించే విషయమై సమీక్ష నిర్వహించారు. శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలో భూ సేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. యాసంగి సీజన్‌కు సంబంధించి రిజర్వాయర్ల కిందున్న చెరువుల్లో నీటిని నింపడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అశ్వరావుపల్లి రైట్ మెయిన్ కెనాల్, ధర్మసాగర్, నవాబుపేట, ఉప్పుగల్లు కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. జనవరి 8వ తేదీ వరకు నియోజకవర్గంలోని పంట పొలాలకు సాగునీరు అందించాలని సూచించారు. అంతకు ముందు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్ట్ కింద ఫేజ్-3 లోని ప్యాకేజీ 6, 7, 8 పునరుద్ధరణ పనులపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోలు గోపీరామ్, వెంకన్న, మార్కెట్ చైర్మన్ లావణ్యరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్‌నాయక్ పాల్గొన్నారు.

ఖిలాషాపురం పాఠశాలకు పుస్తకాలు ఇస్తున్న ప్రతినిధులు

జనగామలో నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

స్టడీ మెటీరియల్ పంపిణీలో వక్తలు

రఘునాథపల్లి, డిసెంబర్ 23: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని పలువురు స్పష్టం చేశారు. మండలంలోని గోవర్ధనగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమకొండ ట్రైసిటీ ఆధ్వర్యంలో సోమవారం స్టడీ మెటీరియల్‌ను అందించారు. దాత పుట్ట హరికిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతలున్న ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని తెలిపారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని, తద్వారా తల్లిదండ్రులు, పాఠశాలలకు పేరు తేవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పేట్లోజు సురేశ్‌బాబు, సభ్యులు బొమ్మినేని నర్సింహారెడ్డి, శోభ, అమంచ మధు, ఉపాధ్యాయులు మేరీ, రఘుపతి, వేణుగోపాల్‌రెడ్డి, కరుణ, శ్రీనివాస్‌రావు, మాధవి పాల్గొన్నారు.

ఖిలాషాపురం పాఠశాలకు పుస్తకాల వితరణ

మండలంలోని ఖిలాషాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇంటర్ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హ్యూమన్ వాల్యూస్ యునైటెడ్ కింగ్‌డమ్ లండన్ వారి సౌజన్యంతో హైదరాబాద్‌లోని హార్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ రూ.30 వేల విలువైన పుస్తకాలతోపాటు బీరువాను సోమవారం అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం భారత రవీందర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం జనరల్ నాలెడ్జికి సంబంధించిన పుస్తకాలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బండి చైతన్యకిశోర్, ఉప్పల రవి, చింత బాలయ్య, శాగ నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, శ్రీకాంత్, కళావతి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

జనగామ చౌరస్తా : జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) విద్యార్థులకు సోమవారం 12వ వార్డు కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మి నాగరాజు చేతుల మీదుగా నోట్ బుక్స్, స్కూల్ బెల్ట్, టై, పెన్నులు, పెన్సిల్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూలక్ష్మి మాట్లాడుతూ కోస్టా గ్రూప్ ఆర్థిక సహకారంతో కోఆపరేటివ్ గ్రూప్స్ హెచ్ఆర్ మేనేజర్ వెన్నెసా అండ్ తెలంగాణ ప్రతినిధి శ్రీధర్ చేయూతతో విద్యార్థులకు అవసరమైన సామాగ్రిని అందించారని తెలిపారు. ఈకార్యక్రమంలో వైకృష్ణ, కోస్టా గ్రూప్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ నివారణకు శాశ్వత చర్యలు : డీఈ

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 23 : విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టామని ట్రాన్స్‌కో స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ(ఆపరేషన్స్) వై రాం బాబు అన్నారు. సోమవారం డివిజన్ కేం ద్రంలోని 132/ 33కేవీ సబ్ స్టేషన్లో చేపట్టిన మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం బస్టాండు ఏరియాలో ఎస్ఎస్ 86/100 కేవీ విద్యుత్ నియంత్రికకు అనుసంధానంగా 100 కేవీ సామర్థ్యం కలిగిన మరో విద్యుత్ నియంత్రికను ఏర్పాటు చేస్తామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. టౌన్ ఏఈ శంకర్, ఏఈ టెక్నికల్ భువనేశ్వరి, సబ్ ఇంజినీర్ హరిత, ఫోర్‌మెన్ రాజేందర్, లైన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, లైన్‌మెన్లు వాసం శ్రీధర్, సందీప్, అన్వర్ పాషా పాల్గొన్నారు.

మరమ్మతులను పరిశీలిస్తున్న రాంబాబు

భూకబ్జాకు కుట్రలతోపాటు చంపుతానని బెదిరింపులు

పోలీసులకు ఇటికాలపల్లి వాసి ఫిర్యాదు

బచ్చన్నపేట, డిసెంబర్ 23 : మా భూమిని కబ్జా చేయాలని కుట్రలు చేయడంతోపాటు చంపుతానని బెదిరిస్తున్నారని మండలంలోని ఇటికాలపల్లికి చెందిన చెవెల్ల స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఇటికాలపల్లిలోని సర్వే నంబర్లు 68, 147, 148, 149లోని ప్రభుత్వ భూమిని ఆలీంపూర్‌కు చెందిన కొందరు రైతులు మరికొన్ని నంబర్లలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించుకున్నారని ఆరోపించారు. సర్వే నంబర్ 147లోని మా పట్టా భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో ఆలీంపూర్‌కు చెందిన కరుణాకర్‌రెడ్డి తనను బెదిరించడమే గాక చంపేస్తానని కుట్ర పన్నుతున్నారని స్వామి వివరించారు. అతడితో తనకు ప్రాణభయం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఎవరినీ చంపుతానని బెదిరించలేదన్నారు. తనపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వివరణ ఇచ్చారు. సంబంధిత వ్యక్తే బౌన్సర్లను తీసుకొచ్చాడని కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు.

కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

చౌడారంలో విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న ఎంపీడీవో సంపత్ కుమార్

జనగామ రూరల్/నర్మెట, డిసెంబర్ 23 : జనగామ మండలం చౌడారంలోని కేజీబీవీ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన దుప్పట్లను సోమవారం ఎంపీడీవో ఉప్పుగల్లు సంపత్ కుమార్, ఎంఈవో రాజేందర్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ చలి తీవ్రంగా ఉండడంతో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నర్మెట మండలం మాన్‌సింగ్‌తండాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినులకు దుప్పట్లను పంపిణీ చేశారు. జీసీడీవో గౌసియాబేగం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన వీటిని అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రజిత, ఎంపీవో శ్రీనివాస్, ఎంఈవో ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలను ప్రజలు తిప్పికొట్టాలి

పాలకుర్తి, డిసెంబర్ 23: దేశంలో బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సోమ సత్యం అన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో పార్టీ జిల్లా మహాసభలు స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేశారు. సోమ సత్యం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీల కోసం పనిచేస్తున్నదన్నారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొస్తూ సామాన్యులపై భారాలు మోపుతున్నదన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాసంపల్లి నాగయ్య, ఎనుగుతల ఆంజయ్య, సోమయ్య, భద్రయ్య, వెంకన్న, ఐలోని, యాదయ్య, ధర్మయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, డిసెంబర్ 23 : ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో 'ప్రజావాణి' కార్యక్రమంలో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్నతో కలిసి ఆయన 76 మంది అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దేవరుప్పుల మండలం కామారెడ్డి గూడేనికి చెందిన దండు సోమయ్య తనకున్న వ్యవసాయ భూమి 4.20 ఎకరాల్లో కేవలం 2.16 ఎకరాలు మాత్రమే ధరణిలో నమోదైందన్నారు. మిగతా పట్టా భూమిని నమోదు చేయాలని వినతిపత్రం అందజేశారు. కొడకండ్ల మండలం రామవరానికి చెందిన మచ్చ సునీత తనకున్న ఎకరం వ్యవసాయ భూమికి సంబంధించి పట్టా పాస్ పుస్తకం జారీ చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. జనగామ పట్టణంలోని 2వ వార్డుకు చెందిన లకిశెట్టి సునీత ఇందిరమ్మ ఇల్లు కోసం గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోగా, ప్రస్తుతం చేపట్టిన సర్వేలో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో తన పేరు గల్లంతైందని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల్లో భాగంగా అన్ని మాడ్యుల్స్‌ను పూర్తి చేయాలని కోరారు. భూవివాదాలు ఉన్నవారు కోర్టు ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కులం, నివాసం, ఆదాయం, ఈబీసీ, మ్యారేజ్ తదితర ధ్రువీకరణ పత్రాల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా తహసీల్దార్లు సర్టిఫికెట్లను అవసరార్థులకు వెంటనే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోలు గోపీరామ్, వెంకన్న, డీఆర్డీవో వసంత, కలెక్టరేట్ ఏవో మన్సూరి, సీపీవో శ్రీనివాస్, డీపీవో స్వరూప, డీసీఎస్‌వో సరస్వతి, డీడబ్ల్యూవో ఫ్లోరెన్స్, డీఏవో రామారావునాయక్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో వేగం పెంచాలి

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. సర్వే నెమ్మదిగా కొనసాగుతున్న గ్రామ పంచాయతీలను గుర్తించి అక్కడ వేగవంతంగా సర్వే చేయించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పబ్లిక్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

కేక్ కట్ చేస్తున్న ఆర్డీవో గోపీరామ్

జనగామ చౌరస్తా, డిసెంబర్ 23 : జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో గోపీరామ్ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ శాంతి, ప్రేమ, త్యాగానికి ప్రతీక యేసుక్రీస్తు అని తెలిపారు. అన్ని మతాలను ఒకే విధంగా గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, కౌన్సిలర్లు వంగాల కల్యాణి మల్లారెడ్డి, జక్కుల అనిత, బొట్ల శ్రీనివాస్, రాంచందర్, పాస్టర్ కే మోజెస్ కుమార్, జేమ్స్, ఫ్రాన్సిస్, బక్క ప్రవీణ్, జిల్లా మైనార్టీ అధికారి రవిందర్, తహసీల్దార్ హుస్సేన్ పాల్గొన్నారు.

జనగామ ఎస్‌హెచ్‌వోగా ట్రైనీ ఐపీఎస్ మునన్ భట్

జనగామ చౌరస్తా, డిసెంబర్ 23 : జనగామ అర్బన్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)గా ట్రైనీ ఐపీఎస్ మునన్ భట్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా వారం రోజుల పాటు అర్బన్ పీఎస్‌లో ఆయన విధులు నిర్వహించనున్నారు. పీఎస్‌కు విచ్చేసిన ట్రైనీ ఐపీఎస్‌కు ఏసీపీ పార్థసారథి స్వా గతం పలికారు. అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గణిత పుస్తకాలతో విద్యార్థులు

కునూరు పాఠశాలలో గణిత దినోత్సవం

జఫర్‌గఢ్, డిసెంబర్ 23 : శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్‌లో గణిత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుడు ముచ్చా భాస్కర్‌రెడ్డి రూ.10 వేల విలువైన గణిత రిఫరెన్స్ పుస్తకాలను పాఠశాల గ్రంథాలయానికి అందించారు. అనంతరం విద్యార్థులకుపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

గురుకుల పాఠశాలలో క్విజ్‌పోటీలు

జనగామ, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : పట్టణంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని మిలీనియం అధ్యక్షుడు గాదె నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో విద్యార్థులకు గణిత రంగోలి, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ చందుపట్ల రవీందర్‌రెడ్డి, పూర్వ రీజనల్ చైర్మన్ శ్రీరాం శ్రీనివాస్, జోన్ చైర్మన్ రంగరాజు ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ నర్సింహులు, రవీందర్, గణిత ఉపాధ్యాయిని ముదిగొండ రాణి, అంజయ్య, రజిత, సునీత, క్లబ్ కోశాధికారి బండ భిక్షపతి, పూర్వ అధ్యక్షుడు కామని శ్రీనివాస బాబు, బైరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు సైతం సమాన అవకాశాలివ్వాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో జలేందర్‌రెడ్డి

లింగాలఘనపురం; డిసెంబర్ 23 : ఆడపిల్లలకు సైతం వివక్ష తల్లిదండ్రులు చదువులో అవకాశాలు కల్పించాలని ఎంపీడీవో జలేందర్‌రెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శుభాంజలి మహిళామండల సమాఖ్యలో సోమవారం లింగ వివక్షకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమాజంలో బాలికల పట్ల వివక్ష కొనసాగుతున్నదన్నారు. దీనిని నివారించేందుకు బాలురతో సమానంగా బాలికలకు సైతం విద్యావకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు రమ్య, ఏపీఎం శంకరయ్య, సీసీలు శ్రీకాంత్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీమతి, మల్లేశం, శ్రీధర్, శోభ పాల్గొన్నారు.

కందులు క్వింటాలుకు రూ.8,711

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 23 : స్టేషన్ ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్లో కందులకు అత్యధికంగా క్వింటాలుకు రూ.8,711 ధర లభించినట్లు మార్కెట్ చైర్ పర్సన్ లావణ్యా శిరీష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సంవత్సరం తొలిసారిగా కందులు మార్కెట్‌కు వేలం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కందులకు మద్దతు ధర రూ.7,550 కాగా రూ.8,711 లభించినట్లు వెల్లడించారు.

యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్, డిసెంబర్ 23 : టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయ ప్రకాశ్ కోరారు. సోమవారం మండలంలోని హిమ్మత్‌నగర్ పాఠశాలలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జయప్రకాశ్ మాట్లాడుతూ ఈ నెల 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు భూక్యా వంశీ కృష్ణ, ఉపాధ్యాయులు జితేందర్, కవిత, వనజాత పాల్గొన్నారు.

వీఎస్సార్‌నగర్‌లో కొండచిలువ హతం

స్థానికులతో హతమైన కొండచిలువ

బచ్చన్నపేట, డిసెంబర్ 23 : మండలంలోని వీఎస్సార్ నగర్‌లో సోమవారం స్థానికులు కొండ చిలువను హతమార్చారు. గుట్టల్లో నుంచి గ్రామంలోకి కొండ చిలువ రావడంతో గమనించిన పలువురు వెంటనే కర్రలతో బాది చంపేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. లేకుంటే ఇళ్లలోకి చొరబడి ప్రజల ప్రాణాలకు ముప్పుతెచ్చేదని స్థానికులు వాపోయారు.

మార్కెట్ కార్యదర్శి వైఖరిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జాయినింగ్ ఆర్డర్స్ ఇప్పించాలని బాధిత ఉద్యోగి వినతి

జనగామ చౌరస్తా, డిసెంబర్ 23 : జనగామ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వైఖరికి నిరసనగా ఓ ఉద్యోగి సోమవారం 'ప్రజావాణి'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాధిత ఉద్యోగి వీ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. గత జూలై 27వ తేదీన కొడకండ్ల నుంచి జనగామ వ్యవసాయ మార్కెట్‌కు సూపర్‌వైజర్‌గా బదిలీపై వచ్చిన తనకు ఇప్పటి వరకు జాయినింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా మార్కెట్ సెక్రటరీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యాలయంలో తనను ఒక ఐడెల్ (ఖాళీ బొమ్మ)గా కూర్చోబెడుతున్నారని పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీ గార్డ్స్‌తో సమానంగా ఉత్తర్వులు జారీ చేసి ప్రతిరోజు ఏదో విధంగా సెక్రటరీ తనను అవమానానికి గురి చేస్తున్నాడన్నారు. తను నిర్వహించాల్సిన విధులను ఔట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డులతో చేయిస్తున్నారని తెలిపారు. తనకు సెలవులు కూడా మంజూరు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్‌ను వివరణ కోరగా నాగార్జునతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులకు 2024 సెప్టెంబర్ 12వ తేదీన జాయినింగ్ ఆర్డర్స్ ఇవ్వగా, నాగార్జున ఒక్కరు మాత్రమే ఆర్డర్స్ తీసుకోలేదన్నారు. మిగతా వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందజేస్తానన్నారు.